బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ అన్నారు. లలితాబాగ్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో ఉప్పుగూడ జెండా వద్ద బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా స్థానిక యువత పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో నేతలు మాదరి చంద్రశేఖర్, ఎడ్ల పండరీనాథ్, పెండెం లక్ష్మణ్, బర్ల శ్రీనివాస్, పొన్న శ్రీనివాసరావు, మల్లేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ట్రా‘ఫికర్’ ఉండదు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతి ఒక్కరూ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తే ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావని బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, యువతకు ట్రాఫిక్ పట్ల నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బుధవారం అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో యువత నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు తెచ్చుకుంటున్నారని అన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులతోపాటు ప్రిన్సిపాల్ సావిత్రి, ఓఎస్‌డీ కపిల్, హెచ్ఓడీ దీపా, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో ఇన్‌చార్జి పాలన ఇంకెన్నాళ్లు!

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో దాదాపు మూడు నెలలుగా పాలన పడకేసింది. మూడు నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న అనుభవజ్ఞులైన వివిధ స్థాయి అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని సీనియర్ వైద్యులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో పరిపాలన పరమైన అనుభవ రాహిత్యంతో సమస్యలు తలెత్తుతున్నాయి. గత రెండు నెలలుగా జీతాలు సైతం రాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అనుభవజ్ఞులైన వారిని పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా నియమించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యా, ఉపాధి బాధ్యత ప్రభుత్వాలదే..

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు

సుల్తాన్‌బజార్: విద్య అవకాశాలతోపాటు ఉపాధిని కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. ఈ మేరకు కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఉర్దూ డిపార్ట్‌మెంట్ నజీర్ అహ్మద్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 7వ నిజాం నవాబు, ఉస్మానియా యూనివర్సిటీ వ్యవస్థాపకులు నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదదూర్ స్మారకోపన్యాసం నిర్వహించారు. రాష్ట్రంలో విద్య అవకాశాలు, సమ్మిళిత ఉపాధి అనే అంశంపై ఆయన మాట్లాడుతూ విద్య అవకాశాలను మెరుగు పరిస్తేనే ఉపాధి లభిస్తుందని, దానికి అనుగుణంగా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యత పెంపొందిస్తేనే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని అందుబాటులోకి తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ విద్య అవకాశాలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌లో మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉర్దూను ద్వితీయ భాషగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత, ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ సరస్వతమ్మ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ రాజు నాయక్, ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ సయ్యదా నసీమ్ సుల్తానా, మహ్మద్ సోహెబ్ అహ్మద్, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ ఆర్షియా, డాక్టర్ కషఫ్, సయ్యద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

గోల్కొండ: గోల్కొండ డివిజన్‌లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. ప్రధాన రహదారులు, ప్రభుత్వ పాఠశాలల ముందే చెత్త డంపింగ్ అవుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గోల్కొండ బడాబజార్‌లోని మ్యూజియం బిల్డింగ్ గోడ పాదవునా క్వింటాళ్ల కొద్దీ చెత్త పేరుకుపోయింది. ఖాజీగల్లీలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కనే భారీగా చెత్త కుప్పలు ఉంటున్నాయి. విద్యార్థులే కాకుండా రోడ్డుపై వెళ్లే పాదచారులు చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులు పర్యవేక్షించే అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గోల్కొండ బడా బజార్‌లో రోడ్డు పక్కన చెత్త



గోతులుగా మారిన కందికల్ గేట్ రహదారి

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. వాహనచోదకులు రోడ్లపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. గుంతలను వెంటనే పూడ్చాలని అధికారులను కోరుతున్నారు.
– చాంద్రాయణగుట్ట



గుంతలమయమైన శంషీర్‌గంజ్ ప్రధాన రహదారి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ ఈవో ఆదిత్యవర్ధన్ రాజు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ ఇంటర్ స్కూల్ లెవల్ టోర్నమెంట్ సెలక్షన్స్ శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయలో బుధవార ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే బండ్లగూడ జోన్‌కు సంబంధించి కబడ్డీ, ఖోఖో పోటీలను బండ్లగూడ ఉప విద్యాధికారి ఆదిత్యవర్ధన్ రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐవోఎస్‌లు లక్ష్మణ సింగ్, దశరథ్, ట్రస్మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్సర, ఆసిఫ్, శారదా విద్యాలయ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం: నిరంజన్

గోల్కొండ: కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పేద, బడుగు వర్గాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చంటి బాబు, ఎం.రఘుపాల్‌రెడ్డి, ఎ.చంద్రోశేఖర్, పరమానందం, కిషన్, గోవర్ధన్‌రెడ్డి, హబీబ్, ప్రేమ్‌కుమార్, శంకర్, హమీద్ ఖాన్, వనజ, షకీలా, దుర్గా, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డి.గోపాల్‌జీ, ప్రేమ్‌సింగ్ రాథోడ్‌లు

అబిడ్స్: అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఉమాశంకర్,, మురళీధర్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ సమాజ అభివృద్ధికి పండిట్ దీన్‌దయాళ్ చేసిన సేవలు కొనియాడారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

చాంద్రాయణగుట్ట: ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ అన్నారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా బుధవారం ఉప్పుగూడలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాదరి చంద్రశేఖర్, జాలిగం చిరంజీవి, నవీన్, పెండెం లక్ష్మణ్, శ్రీనివాస్, వేణు, సతీష్‌చంద్ర, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిధుల మంజూరుపై హర్షం

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ హిందూ శ్మశాన వాటికలో సదుపాయాల కల్పనకు రూ.1.37 కోట్లు మంజూరు చేయడంపట్ల భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పేరోజీ సాయినాథ్(లడ్డూ) హర్షం వ్యక్తం చేశారు. స్థానికఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, లలితాబాగ్ కార్పొరేటర్ ఆజం షరీఫ్, వార్డు మెంబర్ అశోక్ కుమార్ కృషితోనే నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో విద్యుత్ దహన వాటిక, వెయిటింగ్ హాళ్లు, స్నానాల గదులు, ప్రహరీ, సీసీ రోడ్లు, నీటి సదుపాయం వంటివి సమకూరనున్నాయని పేర్కొన్నారు.

సన్మానం



జితేందర్‌రెడ్డికి పూలబొకేను అందజేస్తున్న అఫ్సర్ అహ్మద్ తదితరులు

అబిడ్స్: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జితేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సీడ్స్ సెక్రెటరీ అఫ్సర్ అహ్మద్, స్పోర్ట్స్ ఎండీ సోని బాలదేవిలు ఆయనకు పూలబొకేను అందజేసి అభినందనలు తెలిపారు. న్యూ ఢిల్లీ నుండి నగరానికి వచ్చిన ఆయనకు స్పోర్ట్స్ శాఖ తరపున సత్కారం చేశారు.

వరద బాధితులకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలి

అఫ్జల్‌గంజ్: వరద బాధిత మేరు కులస్తులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ అన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వరదల్లో వేలాది మంది మేరు కులస్తులు రోడ్డుపాలయ్యారన్నారు. వారందరికీ ఒక కుట్టుమిషన్‌తోపాటు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తే జీవనోపాధి పొందుతారన్నారు. ఖమ్మం వరదల్లో వేలాది మేరు కుటుంబాలు నష్టాలకు గురయ్యారని వివరించారు. ప్రభుత్వం అందరినీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పోల్కం శ్రీనివాస్

నిండుకుండలా శాతం చెరువు



శాతం చెరువు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు టోలిచౌకీ నదీమ్‌కాలనీని ఆనుకొని ఉన్న శాతం చెరువు నిండుకుండలా మారింది. టోలిచౌకీ, హకీంపేట్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల నుంచి వర్షం నీరు నదీమ్ కాలనీ గుండా శాతం చెరువులోకి వచ్చి చేరుతోంది. చెరువు నిండిపోవడంతో ఎప్పుడేం జరుగుతుందోనని నదీమ్ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల నుంచి నదీమ్ కాలనీ దిగువ ప్రాంత వాసులకు నిద్ర కరువైంది. పలువురు ముందు జాగ్రత్తగా తమ ఇళ్లల్లోని విలువైన వస్తువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో వైపు చెరువుకు ఉన్న తూముకు మరమ్మతులు చేసి అధికారులు చెరువు నీటిని కిందికి వదులుతున్నారు. అయితే చెరువులోంచి వదులుతున్న నీటి కంటే చెరువులోకి వచ్చి చేరుతున్న వర్షపు నీరే ఎక్కువగా ఉండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

భరతనాట్య గురువులకు సత్కారం



గురువులను సత్కరిస్తున్న వసుంధర, విజయ్‌కుమార్, నిష్టల సుధామాల

నాంపల్లి: నవ్య నాటక సమితి జాతీయస్థాయి 49వ సంగీత, నృత్య పోటీల్లో భాగంగా బుధవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో ప్రముఖ భరతనాట్య గురువులు డాక్టర్ సంజయ్ శాంతారామ్, శ్రుతి, ఎన్.మూర్తిలను ఘనంగా సత్కరించారు. ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నవ్య నాటక సమితి చేస్తున్న సేవను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ మృదంగ విద్వాంసులు జయభాస్కర్, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: ఎమ్మెల్యే



టోలిచౌకీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్, శాతం తలాబ్, నయాఖిలా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెలలో వరుసగా కురుస్తున్న వర్షాలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయన్నారు. టోలిచౌకీ–టూంబ్స్ చౌరస్తా, ఎండి లైన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైపులైన్ల పనులు నత్తన నడకన సాగుతుండటంతో అక్కడి గుంతల్లో వర్షపునీరు చేరిందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత నెలలోనే ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని, ప్రజల ప్రాణాలు పోతున్నా గుత్తేదారులు, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని అన్నారు. అదనపు మాన్‌సూన్ టీమ్‌లు రప్పించి వర్షం నీరు చేరిన ప్రాంతాల్లో వాటిని వినియోగించాలన్నారు. ఆయన వెంట ఏఈ ఉదయ్‌కుమార్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

బహుమతుల ప్రదానం



గెలుపొందిన క్రీడాకారులతో కోచ్ మహ్మద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సముచిత ప్రాధాన్యతను ఇవ్వడం పట్ల పలువురు కోచ్‌లు ఆనందం వ్యక్తం చేశారు. రెండురోజులుగా ఎల్బీస్టేడియంలో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్కూల్ డిస్ట్రిక్ట్ లెవల్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. అండర్–14, 17 విభాగాలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మహ్మద్ సర్వార్, అహ్మద్, ఫైజల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల పరిశీలన

• వైద్యసేవలపై ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ ఆరా

యాకుత్‌పురా: యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుధ్యం) ఎస్. పంకజ, ప్రజారోగ్య శాఖ అధికారులతో కలసి బుధవారం నియోజకవర్గంలోని బస్తీ దవాఖానాలను పరిశీలించారు. రెయిన్ బజార్, తలాబ్ చంచలం, అమన్‌నగర్–బీ, యాకుత్‌పురా, దారుషిఫా, సూపర్‌బజార్ తదితర ప్రాంతాల్లోని బస్తీ దవాఖానాల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందులు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విజృంభిస్తున్న విషజ్వరాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులతో పర్యటించి అవసవమైన చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పంకజ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం, దోమల నివారణ చర్యలపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతూ అవసరమైన జాగ్రత్తలు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ హైదరాబాద్ జిల్లా డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ బీ‌క్రిస్ ఉన్నీసా, మలేరియా విభాగం చీఫ్ ఎంటమాలాజిస్ట్ రాంబాబు, సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాలను పరిశీలించిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ తదితరులు

ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

గౌలిపురా: చికెన్ షాపు నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన తరణుమ్ ఖానం, మహ్మద్ ఫయాజ్(44) దంపతులు. కాగా, మహ్మద్ ఫయాజ్ మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ సమీపంలో బిలాల్ చికెన్ షాపును నిర్వహిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఫయాజ్ ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీన ఉదయం 10.30 గంటలకు చికెన్ షాపునకు వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం 3.22 గంటలకు ఫయాజ్ ఇంట్లో ఉన్న భార్యకు ఫోన్ చేసి డబ్బులు ఎవరో వచ్చారని, డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నారని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య, కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ‘డయల్ యువర్ డీఎం’

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ డి.వి.కె.మూర్తి తెలిపారు. ప్రయాణికులు, బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 99592 26133 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఏదైనా జరిగితేనే స్పందిస్తారా!



నాంపల్లి: ఏదైనా వీవీఐపీల కార్యక్రమం జరిగినప్పుడే జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది స్పందిస్తారనడానికి ఈ చిత్రం చక్కటి నిదర్శనం. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌యూ కళాశాల ప్రాంగణానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో జరిగిన బీఏఎఫ్‌ఎస్ఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం వస్తున్నారనే సమాచారాన్ని అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది జేఎన్‌ఏఎఫ్‌యూ కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. కళాశాలలో ఒకవైపు సీఎం కార్యక్రమం జరుగుతుండగా, మరొక వైపు సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేశారు. హోటల్ తైబా వద్ద మురుగు, పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్స్‌ను నియంత్రించే కార్యక్రమం చేపట్టారు. ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో నివాసం ఏర్పరచుకున్న వీధికుక్కలను పట్టుకెళ్లారు. వీటిలో కొన్ని దొరకగా మరికొన్ని తప్పించుకుని పారిపోయాయి. కళాశాల ప్రాంగణం చుట్టూ పేరుకున్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. రోజువారీగా చేయాల్సిన కార్యక్రమాన్ని బల్దియా సిబ్బంది ఒక్క రోజే హడావుడిగా చేయడం చూసి స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. ఏదైనా వీఐపీల కార్యక్రమం జరిగితేనే జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నేతలు స్పందిస్తారని పలువురు వ్యాఖ్యానించారు.